# ఓ బామ్మ ఓ మనవడు - అదీ కథ

**(19-1-2006, "ఆంధ్రభూమి" వార పత్రిక)**

గంట నుంచి అద్దం ముందు కూచున్నాడు శివబాలయోగి నాగేశ్వర సాయి కుమార్. అందాన్ని ఇనుమడిం పచేసుకోవాలన్న తాపత్రయంలో తబ్బిబ్బులయిపోతూ మహా కష్టపడిపోతున్నాడు. పౌడర్ రాసిన మొహాన్నే మళ్ళీ ఇంత పౌండరు పూస్తూ... ఎగదువ్విన క్రాపునే మళ్ళీ ఎగేసి దువ్వుతూ ఓ ఆయాస పడిపోతున్నాడు. పౌడరు ముక్కులోకెళ్లి హఛ్‌హాఛ్‌మని తుమ్ములు మొదలయ్యాయి.

"ఏవిట్రా నాయినా తుమ్ముతున్నావు? జలుబు గానీ చేసిందా ఏం పాడు? కాస్త మిరి యాల కషాయం కాచిస్తాను... తాగేసి వెళ్దువు గాని" జవాబు కోసం ఎదురుచూడకుండా చీర పైకి దోపేసి వంటింట్లోకెళ్లి ఆ పన్లో పడింది బామ్మ.

"ఏవిట్రా ఎప్పటికీ తెమలవు? ఎంతసేపు పూసినా ఆ పౌడరే... ఎంత సేపు దువ్వినా ఆ క్రాఫే... అవతల వాళ్లెదురు చూస్తుంటారు... ఆ గదిలోంచి ఇవతలకి ఊడిపడు" ఎప్పుడో తను రెడీ అయి కూచుని.... పట్టు చీర పట్టు జాకెట్టుతో, పెట్టుకున్న తట్టెడు నగలతో ఆపసో పాలు పడిపోతూ కొడుకు చేసే ఆలస్యానికి చిరాకు పడిపోతోంది సౌభాగ్యం.

"వీడంతే... ప్రతిసారి పెళ్లిచూపులకీ మన ఓర్పు పరీక్షిస్తాడు" చిర్రుబుర్రులాడుతున్న తండ్రి మాటలు కూడా వినిపించాయి కుమార్‌కి. ముక్కు నించీ కింద గడ్డం వరకూ పౌడరంతా పోయింది. మళ్లీ ఇంత పౌడరు చేతిలో వేసుకుని ముక్కులో కెళ్లకుండా జాగ్రత్తపడుతూ పూయడం మొదలెట్టాడు. తనమీద తనకే జాలేస్తోంది. ఇది పన్నెండో పెళ్లిచూపులు తను చూడబోయేది. అదివరకు

చూసిన పదకొండులో ఆరు సంబంధాలు జాతకాలు కుదర్లేదని తిరగ్గొట్టాడు తండ్రి అయిదు సంబంధాలు తల్లి తిరగ్గొట్టింది రంగు తక్కువంటూ.

ఎన్నాళ్లీ పెళ్లిచూపులకి వెళ్లడాలని కాస్త దిగులు మొదలై ఓ రోజు బామ్మ దగ్గర జేరి సన్నగా గునిశాడు. "ఏవిటి బామ్మా! వచ్చిన సంబంధమల్లా తిరగ్గొట్టేస్తున్నారు అమ్మానాన్నగారు. ఇలా అయితే నా పెళ్లెప్పుడవుతుందీ?"

"పోరా పిచ్చికన్నా... ఈ రోజుల్లో ఆడపిల్లలే బెంగెట్టుకోవట్లేదు ఓ పట్టాన పెళ్ళి సంబంధం కుదరకపోయినా. మొగపిల్లాడివి నీకెందుకురా బెంగా?"

అమ్మో! అమ్మో! ఎంత మాటందీ? హూ!... బామ్మక్కూడా లోకువైపోయాడు తను.

"హూ.... నాకెందుకు బామ్మా బెంగ? ఈ బెంగంతా నీ కోసం గానీ!"

"నా కోసం దేనికిరా?"

"ఏదో నువ్వు కన్ను మొయ్యకముందే ఆ మూడుమూళ్లూ ఏ పిల్ల మెళ్లోనో వేసేస్తే సంతృప్తిగా నువ్వు వెళ్లిపోతావని"

"ఓర్నీ! ఎంత మాటన్నావురా? దుక్కముక్కలా ఉన్నానేను. ఓ బి.పి.లేదు. ఓ షుగర్లేదు. ఓ ఆయాసం లేదు. ఇప్పటికీ రెండు పూట్లాసుష్టుగా భోంచెయ్యడమే కాక పొద్దున్న టిఫినూ సాయంత్రం స్వీట్లూ అన్నీ తింటున్నాను. ఏది మానేశాను గనకా?"

"జానాను... అన్నీ లాగిస్తున్నావు" నవ్వుతూ చిన్నగా గొణిగాడు.

"ఏవిటంటావ్?"

"అబ్బే! నేనేవంటానూ?... నువ్వంత తొందరగా వెళ్లవూ..ఆహా.. వెళ్లకూడదూ అంటున్నాను. నా పిల్లల పెళ్లిళ్లు కూడా చూడద్దూ అంటున్నాను"

"అలారా దారికి, అన్నట్టూ.. నీ పిల్లల్లో ఒకళ్లకి తప్పకుండా నా పేరు పెట్టుకోవాలిరోయ్!"

"మరీ పాతకాలం పేరు బామ్మా నీది, ఎలా పెట్టమంటావ్?"

"నా పేరుకేవొచ్చిందిరా నీకు తిక్క కాకపోతే.. సోమిదేవమ్మ అని ఎంత చక్కటి పేరు పెట్టారు మా అమ్మా నానా!"

"నిజవే అనుకో.. ఆలోచిద్దాంలే"

"ఇంక చించేదేమీ లేదురోయ్! నా పేరే ఖాయం అనుకో"

"మరి... ముందు మొగపిల్లాడు పుడితే?...

"పుట్టనీ... సోమిదేవ్ అని పెట్టు. ఎంత బావుంటుందో నాజుగ్గా"

"ఏరా? ఇవాళ కదుల్తావా అసలు?" తండ్రి పిలుపులాంటి ఆరుపుతో ఆలోచనల్లోంచివతలి కొచ్చాడు.

ఈ సంబంధం అవుతుందని చాలా గట్టి నమ్మకంతో ఉన్నాడు. అందుకు కారణం ఉంది. ఇన్నాళ్లూ పిల్లని చూసొచ్చాక తీరిగ్గా అప్పుడు జాతకాల వాళ్ల చుట్టూ తిరిగి జాతకం కుదర్లేదురా అనేవాడు తండ్రి. ఇది పద్ధతి కాదని ముందు జాతకం కుదిరితేనే పిల్లని చూడడానికి వెళ్దామని నచ్చచెప్పాడు తండ్రికి. ఏ కళనున్నాడో ఒప్పుకున్నాడాయన. లేకపోతే హాత్తెరీ! నువ్వా నాకు చెప్పేదంటూ ఇంతెత్తున లేస్తాడు. జాతకాలు కుదిరాయన్నాడు సిద్ధాంతిగారు, తల్లిక్కూడా బతిమాలీ బామాలీ నచ్చచెప్పాడు. "పిల్లని చూసొచ్చాక అప్పుడు నువ్వు రంగులేదురా అంటూ నన్ను కుంగదియ్యకు. బాగా తెల్సిన వాళ్ల ద్వారా ఆ అమ్మాయి రంగు కచ్చితంగా వాకబు చేసుకో" అని హెచ్చరించాడు. ఆవిడా పని తు.చ తప్పకుండా పాటించి ఓ.కె. అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అటు తండ్రి నించి ఓ.కే. ఇటు తల్లి నించి ఓ.కే. అమ్మయ్య అనిపించింది. పెళ్లిచూపుల్లోనే తను ఓ.కే. చెప్పెయ్యాలని నిర్ణయించుకున్నాడు. అద్దం ముందు నించి లేచి గదిలోంచివతలికొచ్చాడు.

"ఏవిటోనే అమ్మాయ్! మిరియాల కషాయం కాచానుగానీ మిరియాల వాసనే రావట్లేదు. అదేం విడ్డూరమో?" కషాయం గ్లాసు వాసన చూసుకుంటూ హాల్లోకొచ్చింది బామ్మ.

"నీ ముక్కెప్పుడు పనిచేసింది గనకా? అది పనిచేస్తే చెప్పకోవాలి విడ్డూరం అని"

"చాల్లేరా వేళాకోళం. ఈ కొంచెం గొంతులో పోసుకునెళ్లు. లేకపోతే అక్కడ పెళ్లిచూపుల్లో హాచ్‌హాఛ్ అంటూ కూచుంటావు. వాళ్లు హడిలిపోయి ఈ పిల్లాడికేదో ఎయిడ్సో మాయదారి రోగవో అనుకుంటారు"

"బామ్మా!.." ఆవేశంలో జుట్టు పీక్కోబోయి పెళ్లికూతురు పెళ్లిచూపులు మాట గుర్తొచ్చి సింపుల్‌గా పళ్లు కొరుక్కుని ఊరుకున్నాడు.

"బామ్మా! తుమ్మితే ఎయిడ్సా?"

"ఏదో లేరా! ఏదో ఓ రోగం పేరు అనాలి కద అని ఇంగ్లీషు పేర్లు నాకూ తెల్సని గొప్ప కోసం ఎయిడ్స్ అన్నాను. అంతమాత్రానికే అంత ఉక్రోషపడి పోతావెందుకూ? అంత గట్టిగా అరుస్తావెందుకూ"...

"అసలు ఎయిడ్స్ అంటే తెల్సానీకు?"

"ఏడ్చినట్టుంది. ఇప్పుడావిడకి నువ్వు జబ్బుల గురించి చెప్తూ కూచుంటావా? పిల్లని చూడ్డాని కొస్తావా?" ఉరిమినట్టే అరిచి పాతాళభైరవిలో రంగారావులా పేరు సార్థకం చేసుకున్నాడు తండ్రి రంగారావు.

"ముందిది గొంతులో పోసుకో మా నాయిన మా నాయిన" గ్లాసిస్తూ గడ్డం పుచ్చుకుంది బామ్మ. కళ్లు గట్టిగా మూసుకుని మొహం భయంకరంగా పెట్టి గొంతులో కాస్త పోసుకున్నాడు. ఆ వెంటనే వాష్ బేసిన్ దగ్గరికి పరిగెత్తి తుపుక్కున ఉమ్మేశాడు.

"బామ్మా నువ్వసలు బామ్మవేనా?"

"అబ్బే! మీ బామ్మ డూప్‌ని" చాలా కూల్‌గా జవాబిచ్చిందావిడ.

"నీ సంగతేమో గానీ ఆ మిరియాల కషాయం మాత్రం డూపే"

నాలిక్కరుచుకుంది సౌభాగ్యం. "అన్నట్టు అత్తయ్యగారూ మిరియాలు నిన్ననే అయిపోయాయి కదండీ. మీకెక్కడ దొరికాయి?"

"దొరకడానికి నేనేవన్నా రోడ్డునపడి వెతుక్కున్నానా? అదుగో ఆ చిన్న తెల్ల ప్లాస్టిక్ డబ్బాలో మిరియాలున్నాయిగా?"

"అయ్యో! మీ అబ్బాయిల్లు బంగారం గానూ.....

అవి నిన్న మన పక్కింట్లోంచి నేను తెచ్చిన చంద్రకాంత విత్తనాలండీ. మన పెరట్లో వేద్దామని తెచ్చాను"

"పెరట్లో కాదు నా పొట్టలో వేస్తోంది బామ్మ"

" మీరు కదిలేదేవన్నా ఉందా లేదా? వర్షం వొస్తే పెళ్లిచూపులుండవు గాక ఉండవు"

మరుక్షణం కుమార్ కాళ్లు బూట్లల్లో మనిషి వీధి గుమ్మంలో ఉన్నాడు.

★ ★ ★

రెండు నెలల తర్వాతి ముహూర్తంగానీ పిల్లా పిల్లాడి నక్షత్రాలకి తగ్గది కుదర్లేదు. సరే అంటే సరే అనుకున్నారు.

ఓ రోజున తీరుబడిగా కూచుని అమ్మాయికి ఉత్తరం రాశాడు కుమార్. ఫోన్లో మాట్లాడటం కంటే ఉత్తరాల్లో అయితే మనసులో ఉన్నవన్నీ కాగితాల మీద పరవచ్చునిపించింది.

"కుమారి వెంకట విజయలక్ష్మి బాలాత్రిపుర సుందరి గారికి,

మీరు నాకు చాలా నచ్చారు. మీ మొహం దోసకాయ షేపులో నా మనసు దోచుకుంది. దోసకాయ పచ్చడంటే నాకు చాలా ఇష్టం పచ్చిమిరపకాయలూ మరింత కొత్తమీర వేసి ఘుమఘుమ లాడిపోయేలా చేస్తుంది మా బామ్మ. మా బామ్మ దగ్గర ట్రైనింగ్ అవుదురు గానీ. మీ కళ్లు కరక్కాయల్లా అందంగా కనిపించాయి. చలి కాలం నాకు దగ్గు వచ్చినప్పుడల్లా కరక్కాయ కషాయం ఎంత బాగా చేసిస్తుందనుకున్నారూ మా బామ్మా. మీ ముక్కు ఉల్లికాడలా ముద్దొచ్చేలా ఉంది. ఉల్లికాడల పులుసు చెయ్యడంలో మా బామ్మ తర్వాతే ఎవరైనా. తల్చుకుంటేనే నోట్లో నీళ్లూరిపోతున్నాయి. నాకిప్పుడు. మీ పెదవుల వంక చూసినప్పుడు మా

బామ్మ చేసే దొండకాయ గుత్తుల కూరే గుర్తొచ్చిందనుకోండి. మరికాస్త వేసుకోరా మరి కాస్త వేసుకోరా అంటూ వొండిన కూరలో మూడొంతుల కూర నా చేతే తినిపిస్తుంది బామ్మ. తెల్లగా సుకుమారంగా ఉన్న పీ చెవులు బామ్మ చేసే స్వీట్ పనసతొనల్ని జ్ఞాపకం చేసింది. ఆ స్వీట్ మీరెప్పుడన్నా తిన్నారా? చాలా బావుంటుంది. నాకేవేవి ఇష్టమో అవన్నీ బామ్మ తప్పకుండా నేర్పిస్తుంది మీకు. ఇంట్లో వంటిల్లు కాక వేరే గదులుంటాయని మర్చిపోతుంటుదావిడ. ఎప్పుడూ వంటింట్లోనే ఉంటుంది. మీరావిడికి కంపెనీ ఇద్దురుగానీ, ఏదో పొరపాట్న తెలియక ఆవిడ ముక్కు గాలి పీలుస్తోంది గానీ వాసన లేవీ దానికి తెలియవు. అవి మీరు చెప్పచ్చులెండి ఆవిడకి. ఈ ఉత్తరం అందగానే మీ ఫోటో ఒకటి పంపించండి నాకు. రోజూ నిద్రలేస్తూనే మీ మొహం చూసుకుంటాను.

ఇట్లు

శివబాలయోగి నాగేశ్వర సాయికుమార్"

మూడు రోజుల్లో కుమార్‌కి కొరియర్లో ఓ పార్సిల్ వొచ్చింది. గదిలోకెళ్లి తలుపులు దగ్గరగా వేసి మంచంమ్మీద కూచుని లలలా లలలా లక్కీఛాన్సులే పాడుకుంటూ పార్సిల్ విప్పాడు. లోపలున్న అట్ట పెట్టి జాగ్రత్తగా తెరిచాడు.

అందులో ఉన్నవి ఒక్కొక్కటి మెల్లిగా బయటికి తీశాడు.

ఓ దోసకాయ... రెండు కరక్కాయలు.... ఓ ఉల్లికాడా... రెండు దొండకాయలు. వొండిన స్వీట్ పనసతొనలు రెండూ... ఒక చిన్న ఫెవికాల్ డబ్బా... ముత్యాల్లాంటి అక్షరాలతో ఉన్న ఓ కాగితం.

"శివబాలయోగి నాగేశ్వర సాయికుమార్ గారికి,

నా (మొహం) ఫొటోలో విడిభాగాలు పంపిస్తున్నాను. అతికించి తయారుచేసుకోండి 'నా మొహం' మన పెళ్లయ్యాక బామ్మగారు ఏదైనాయాత్రా స్పెషల్లో బయల్దేరి కొన్నాళ్లు యాత్రలు తిరిగి రావడానికి టిక్కెట్టు ఇప్పుడే కొని ఉంచండి పాపం... నాలుగూ తిరిగి రానివ్వండి. తీర్థయాత్రలు చెయ్యాలని ఆవిడకి ఉండదూ పాపం. ఎప్పుడూ వంటిల్లేనా.

ఇట్లు

వెంకట విజయలక్ష్మీ బాలా త్రిపురసుందరి"

చెంపలు గట్టిగా వాయించుకున్నాడు కుమార్ చదవడం పూర్తి అవగానే..

ఇంత మప్పితంగా ఎందుకు పెంచావే బామ్మా... బతకడానికి తినాలి గానీ తినడానికే బతక్కూడదన్న జీవిత సత్యం నీకెందుకు తెలియలేదే బామ్మా...

"ఏవిట్రా పిల్చావా? నువ్వెందుకు పిలుస్తావో నాకు తెలియదు గనకనా! వంటెప్పుడో అయిపోయింది. రా భోజనానికి. మరింత కొత్తిమీరి దట్టించి చేశాను దోసకాయి పచ్చడి... నువ్వు రావడమే ఆలస్యం" దగ్గరగా వేసి ఉన్న తలుపులు కొద్దిగా తోసి తొంగి చూసింది బామ్మ. ఎదురుగా మంచమ్మీద దోసకాయ ముసిముసి నవ్వులు నవ్వుతున్నట్టే కనిపించింది కుమార్ కళ్లకి

★★ ★★ ★★